# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 15-11-2024** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **భగవాన్ బిర్సాముండా 150 వ జయంతి ఉత్సవాలను ఏడాది పాటు నిర్వహించనున్నామని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తెలిపారు.**

2. **ఢిల్లీ లో నిర్వహించనున్న లీడర్‌షిప్ సదస్సులో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ రోజు పాల్గొంటారు.**

3. **ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్ట్ పూర్తి చేసి ప్రజలకు సాగు, తాగునీటి ని అందిస్తామని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు పేర్కొన్నారు.**

4. **రాష్ట్రంలో వచ్చే విద్యాసంవత్సరం నాటికి ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ ఉద్యోగాల భర్తీకి చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారాలోకేష్ వెల్లడించారు.**

5. **రబీ సీజన్ కు సంబంధించి సాగుచేసిన పంటల వివరాలను ఈ రోజు నుంచి ఈ-క్రాప్ లో నమోదు చేస్తున్నామని రాష్ట్ర వ్యవసాయ శాఖ తెలిపింది.**

==========================

భగవాన్ బిర్సాముండా 150 వ జయంతి ఉత్సవాలను ఏడాది పాటు నిర్వహించనున్నామని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తెలిపారు. బీహార్ లోని జుమూయ్ లో నిర్వహించిన జన్ జాతీయ గౌరవ దివస్ కార్యక్రమంలో ప్రధానమంత్రి ఈ రోజు పాల్గొన్నారు. భగవాన్ బిర్సా జయంతి ఉత్సవాల సంధర్భంగా స్మారక నాణమును తపాలా బిళ్ళను ప్రధానమంత్రి విడుదల చేశారు. అనంతరం ప్రధానమంత్రి మాట్లాడుతూ,

వాయిస్ ( 30 సెకన్లు)

అదేవిధంగా గ్రామీణ మారుముల ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు, గిరిజనుల అభివృద్ధి కొరకు 6 వేల 640 కోట్ల రూపాయలతో చేపట్టే పలు అభివృద్ధి కార్యక్రమాలకు ప్రధానమంత్రి శంకుస్థాపన చేశారు.ప్రధానమంత్రి జన్ మన్ కార్యక్రమం కింద నిర్మించిన 11,000 గృహాలను కూడా ప్రధానమంత్రి దృశ్యమాధ్యమం ద్వారా ప్రారంభించారు.

--------------------------

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ రోజు ఢిల్లీ వెళ్లనున్నారు. పర్యటనలో భాగంగా ప్రముఖ ఆంగ్ల పత్రిక నిర్వహించనున్న లీడర్‌షిప్ సదస్సులో ముఖ్యమంత్రి పాల్గొంటారు. శాసనసభ సమావేశాలకు

హాజరైన అనంతరం ఈ మధ్యాహ్నం నుంచి బయల్దేరి గన్నవరం విమానాశ్రయానికి చేరుకుని అక్కడి నుంచి ఢిల్లీ వెళ్తారు. ఈ పర్యటనలో భాగంగా కేంద్ర ఆర్థికమంత్రి సహా పలువురు కేంద్ర మంత్రులను కలిసే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

---------------------------

రాష్ట్ర శాసనసభ బడ్జెట్ సమావేశాలు నాల్గవ రోజు కొనసాగుతున్నాయి. ప్రశ్నోత్తరాల సమయం కొనసాగుతోంది. శాసన సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రులు సమాధానమిస్తున్నారు. ప్రశ్నోత్తరాల అనంతరం బడ్జెట్ పై చర్చిస్తారు. చివరగా బడ్జెట్ పై చర్చ ముగిస్తూ ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ సమాధానమిస్తారు. తర్వాత శాసన సభలో రెండు బిల్లులు రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టనుంది. ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ ఎంప్లైమెంట్ చట్ట సవరణ బిల్లు..2024 ను ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ ప్రవేశ పెట్టనున్నారు. ఆంధ్ర ప్రదేశ్ ఎలక్ట్రసిటీ డ్యూటీ చట్ట సవరణ బిల్లు. 2024 ను విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ప్రవేశ పెట్టనున్నారు.

---------------------------

ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్ట్ పూర్తి చేసి ఉత్తరాంధ్ర ప్రజలకు సాగు, తాగునీటి ని అందిస్తామని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. ఈ రోజు శాసనసభ సమావేశాల్లో భాగంగా ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్ట్ పై శాసనసభ్యులు అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానమిస్తూ, నదుల అనుసంధానం ద్వారా రాష్ట్రంలో కరువు నివారించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. వచ్చేనెలలో పనులు ప్రారంభించి 2025 జులై నాటికి గోదావరి వరద జలాలను ఉత్తరాంధ్రకు అందిస్తామని మంత్రి తెలుపుతూ,

వాయిస్ ( 32 సెకన్లు)

---------------------------

రాష్ట్రంలో వచ్చే విద్యాసంవత్సరం ప్రారంభం నాటికి ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ ఉద్యోగాల భర్తీకి చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. శాసనసభ సమావేశాల్లో భాగంగా డిఎస్సీ నోటిఫికేషన్, ఉపాధ్యాయ పోస్టుల భర్తీపై శాసనసభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానమిస్తూ... ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు మెగా డిఎస్సీ ని ప్రకటించామన్నారు. న్యాయపరంగా ఎటువంటి అవరోధాలు లేకుండా ఉపాధ్యాయుల ఉద్యోగాలను భర్తీ చేయాలన్నదే ప్రభుత్వం లక్ష్యమని మంత్రి తెలియజేస్తూ,

వాయిస్ ( 29 సెకన్లు)

---------------------------

రబీ సీజన్ కు సంబంధించి సాగుచేసిన పంటల వివరాలను ఈ రోజు నుంచి ఈ-పంటలో నమోదు చేస్తున్నామని రాష్ట్ర వ్యవసాయ శాఖ డైరెక్టర్ ఎస్.ఢిల్లీరావు తెలిపారు . రాష్ట్ర వ్యాప్తంగా ప్రారంభం కానున్న ఈ-పంట నమోదుకు సంబంధించి మార్గదర్శకాలు జారీ చేశారు.పంటల సాగు వివరాలను పూర్తి పారదర్శకంగా నమోదు చేయాలని యాప్లో నమోదు చేసిన సమాచారాన్ని భారత ప్రభుత్వ పోర్టల్ తో అనుసంధానం చేస్తామన్నారు. జియో ఫెన్సింగ్ ద్వారా గరిష్ట నిడివి 50 మీటర్ల లోపు పంట వివరాలను నమోదు చేయాలన్నారు. 2025 మార్చి 15 నాటికి ఈ పంట నమోదు జాబితాను రైతు సేవా కేంద్రాల్లో ప్రదర్శనకు ఉంచేలా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు.

---------------------------

విద్యార్థులకు చదువుతో పాటు సంస్కృతి, సంప్రదాయాల పట్ల అవగాహన కల్పించాలని అవనిగడ్డ శాసనసభ్యులు మండలి బుద్ధప్రసాద్ అన్నారు. గుంటూరు జిల్లా నంబూరులోని వివిఐటి కళాశాలలో ఈ రోజు నుండి మూడు రోజుల పాటు నిర్వహించనున్న "ప్రపంచ తెలుగు బాలలపండుగ" కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మండలి బుద్ధప్రసాద్ మాట్లాడుతూ, బాలబాలికలలో సృజనాత్మకతను వెలికితీసేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతోగానో ఉపయోగపడతాయని అన్నారు. బోధించే భాషలన్నింటిలో మాతృభాషకు ప్రధాన స్థానం ఉండాలని పేర్కొన్నారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ లో కొత్తగా పింఛన్ కు అర్హులైనవారు డిసెంబర్ మొదటి వారం నుంచి దరఖాస్తు చేసుకోవచ్చని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ వెల్లడించారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ అధికారులతో మంత్రి నిన్న సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పింఛన్ పంపిణీ సమయంలో లబ్దిదారులు గ్రామంలో లేకపోయినా తదుపరి నెలలో పింఛన్ మొత్తాన్ని కలిపి ఇస్తామని తెలిపారు. పలు కారణాలతో తాత్కాలికంగా పింఛన్ నిలిపివేసిన వారు మళ్ళీ దరఖాస్తు చేసుకున్న వారికి తిరిగి పింఛన్ పునరుద్ధరించే విధంగా చర్యలు తీసుకోవాలని మంత్రి అధికారులను ఆదేశించారు.

---------------------------

అనంతపురంలో ఈ రోజు నుండి ఈ నెల 19వ తేదీ వరకు సోంతోష్ ట్రోఫీ ఫుట్‌బాల్ టోర్నమెంట్ – 2024 నిర్వహిస్తున్నామని ఆంధ్రప్రదేశ్ ఫుట్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు కోటగిరి శ్రీధర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ అనంతపురం ఆర్డీటీ క్రీడా మైదానంలో ఈ రోజు మధ్యాహ్నం 2.30 నిమిషాలకు కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ జట్ల మధ్య తొలి మ్యాచ్ జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమ ప్రారంభోత్సవానికి ఆలిండియా ఫుట్‌బాల్ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షులు కళ్యాణ్ చౌబేతో పాటు జిల్లా కలెక్టర్ వి.వినోద్ కుమార్ హాజరౌతారని తెలిపారు.

---------------------------

జనవరిలో ప్రారంభం అయ్యే కుంభ మేళాకు వెళ్లే భక్తుల కోసం భారత్ గౌరవ్ టూరిస్టు రైలును ఇండియన్ రైల్వే కేటరింగ్ అండ్ టూరిజం కార్పొరేషన్–ఐఆర్‌సీటీసీ అందుబాటులోకి తీసుకొచ్చిందని ఆ సంస్థ జాయింట్ జనరల్ మేనేజర్ కిషోర్ సత్య తెలిపారు. విజయవాడలో ఈ రోజు ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ, భారత్ గౌరవ్ టూరిస్టు రైలుకు యాత్రికుల నుంచి స్పందన లభిస్తుండటంతో తాజాగా విజయవాడ నుండి శబరిమల యాత్రకు కూడా ప్రత్యేక రైలును ఏర్పాటు చేశామని తెలిపారు.

వాయిస్ ( 33 సెకన్లు)

======================